సాకి చెరువు ఆక్రమణలపై నజర్

చర్యల కోసం అధికారులతో హైడ్రా కమిషనర్ చర్చ
కోర్టు కేసులపై వివరాలు కోరిన రంగనాథ్
నక్కవాగు బఫర్ జోన్ ఆక్రమణలపై దృష్టి

సాకి చెరువు నక్షను పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పటాన్‌చెరు, ఆగస్టు 31: పటాన్ చెరు పట్టణ నడి బొడ్డున ఉన్న సాకి చెరువులోని ఆక్రమణలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. పటాన్ చెరు డివిజన్‌లోని సాకి చెరువును ఆయన శనివారం పరిశీలించి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. చెరువులోంచి వేసిన రోడ్డు గుండా శాంతినగర్ కాలనీ ఎంట్రెన్స్‌లో ఆగి అక్కడున్న ఇండ్లను పరిశీలించి వాటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ నిర్మాణాల్లో అధిక శాతం సాకి చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. కొందరు కోర్టులో కేసులు వేశారని వివరించారు. కోర్టు కేసుల వివరాలు తనకు తెలుపాలని సూచించారు. ఇప్పటికే 18 అక్రమ కట్టడాలు ఉన్నట్టుగా అధికారులు పేర్కొన్నారు. చాలా కాలం క్రితమే ఇండ్ల నిర్మాణం జరిగినట్టుగా ఉందని రంగనాథ్ అన్నారు. పూర్తి వివరాలు తీసుకుని చర్యలకు దిగుతామని ఆయన అన్నారు. సాకి చెరువు తూములు మూసివేసి ప్రముఖ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్లు కడుతున్నదని పలువురు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. స్పందించిన రంగనాథ్ చెరువుకు సంబంధించి ఎలాంటి ఆక్రమణలున్నా పరిశీలించి, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలు అధికారులు సేకరిస్తారన్నారు. ఆరోపణలు వచ్చిన నిర్మాణానికి అనుమతులున్నాయని అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు. నక్కవాగు బఫర్ జోన్‌లో భారీ అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారని, నక్క వాగుకు వచ్చే కాలువలు గల్లంతయ్యాయని పలువురు విలేకరులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై కమిషనర్ తక్షణమే ఇరిగేషన్ శాఖ అధికారుల వివరణ తీసుకున్నారు. అక్కడ పర్మిషన్లు తీసుకుని నిర్మాణం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. అధికారులు పర్మిషన్లతో కొన్ని నిర్మాణాలున్నాయని సందేహాస్పదంగా వివరణ ఇవ్వడంతో ఆయన నక్కవాగుకు సంబంధించిన పూర్తి డిటైల్స్‌తో కూడిన నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం, అధికారుల వద్ద ఉన్న సాకి చెరువు నక్షాను పరిశీలించి వాటిలోని ఆక్రమణలను తెలుసుకున్నారు.

చెరువులు, కుంటల పరిరక్షణకు హైడ్రా ముందడుగు

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాల పరిశీలన
అమీన్‌పూర్‌లో కమిషనర్ సుడిగాలి పర్యటన

ఇరిగేషన్ డీఈ రామస్వామి ద్వారా వివరాలను తెలుసుకుంటున్న కమిషనర్ రంగనాథ్

అమీన్‌పూర్ ఆగస్టు 31: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని చెరువులు, కుంటల పరిరక్షణే లక్ష్యంగా హైడ్రా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ల పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని, హైడ్రా కమిషనర్ రంగనాథ్ అమీన్‌పూర్‌లో శనివారం విస్తృతంగా పర్యటించారు. దీంతో, అక్కడ అక్రమ నిర్మాణాలపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని పెద్ద చెరువు, కుంటలను కమిషనర్ రంగనాథ్ తనిఖీ చేశారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నాలా కబ్జాలపై ఆరా తీశారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా నిర్మించిన కట్టడాల వెనక ఎంతవారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్యలతో బడా బిల్డర్లు నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నోటీసులు అందించిన వెంటనే కూల్చివేతల చర్యలకు పూనుకోనున్నట్లు తెలిసింది. అక్రమ నిర్మాణాలు ఎలా జరిగాయో? అనుమతులు ఎలా వచ్చాయో? సమగ్రంగా అన్ని విషయాలను బయటపెట్టి బాధ్యులపై తగు చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం అవుతుంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు, చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాకు గురయ్యాయి అన్న ఫిర్యాదులు అందితే, ఉపేక్షించే పరిస్థితి లేదంటున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

అధికారులు జారీ చేసిన నోటీసులు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్న హరిజన బస్తీ బాధితులు

నోటీసుల పేర.. మా బతుకులు ఆగం చేయొద్దు!

ఆవేదన వ్యక్తం చేస్తున్న హస్మత్‌పేట హరిజన బస్తీవాసులు

బాలానగర్, ఆగస్టు 31: నగరంలో కొన్ని రోజులుగా హైడ్రా ఆగడాలు ఓ వైపు కొనసాగుతున్నాయి. నగర వ్యాప్తంగా హైడ్రా పేరు వింటేనే ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. తమ పాలిట శాపంగా ఎక్కడ మారుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువు సమీపంలోని హరిజన బస్తీ వాసులు ఆందోళన చెందుతున్నారు. రిట్ పిటిషన్ 14728 ఆఫ్ 2007 ప్రకారం, అక్రమ నిర్మాణాలపై హైకోర్టు ఉత్తర్వుల మేరకు హస్మత్‌పేట హరిజన బస్తీ వాసులకు ఇటీవల బాలానగర్ మండల అధికారులు 125 మందికి నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా హరిజన బస్తీవాసులు మాత్రం హైడ్రాకు వంత పాడుతూ రెవెన్యూ అధికారులు తమకు నోటీసులు జారీ చేశారని అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. తాజాగా, అధికారులు నోటీసులు జారీ చేయడం పట్ల హైడ్రా మా ఇండ్లపై ఎక్కడ కన్ను వేస్తుందోనన్న ఆందోళనలో ఉన్నారు. గత 45 సంవత్సరాలుగా 50, 70 గజాల స్థలాలలో ఇండ్లు కట్టుకొని, జీహెచ్ఎంసీ పన్నులు చెల్లిస్తున్నామని, కూలీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నట్లు వారు వాపోతున్నారు. మేము ఇండ్లు కట్టుకున్న సమయం నుంచి ఇప్పటి వరకు చాలా ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి. తమ జోలికి ఎవరు రాలేదు. సదుపాయాలు కల్పించారు. కానీ, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మా బతుకులు ఆగం చేయాలని చూడటం బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఇండ్లు కూల్చి వేస్తామంటే మేం ఎక్కడ పోవాలె...? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బతుకుడే కష్టంగా ఉంది.. ఇల్లు పోతే..

దేవుని గుడికి నోటీసులేంది? 45 ఏండ్లుగా ఇక్కడ ఇండ్లు కట్టుకొని ఇక్కడే ఉంటున్నం. ఇప్పుడు నోటీసులు ఇచ్చుడేంది. మాలాంటి పేదోళ్లంటే సర్కారోళ్లకు అలుసుగా ఉన్నట్లుంది. పేదలకు సాయం చేస్తే వాళ్లకు కూడా మేలు జరుగుతది. మా బతుకులు ఆగం చేయాలని చూస్తుండ్రు. ఇది మంచిది కాదు. భర్త, కొడుకు చనిపోయిండ్రు. నేను బతుకుడే కష్టంగా ఉంది. ఇప్పుడు ఇల్లు కూడా లేకుండా చేస్తామంటే ఎట్లా? నా బతుకు ఆగం చేయద్దు.

– తుణికి యాదమ్మ, హరిజన బస్తీ నివాసి

మా ఇండ్లు కూల్చి రోడ్డున పడేయొద్దు

మా ఇండ్లు కూల్చి మమ్ములను రోడ్డున పడేయొద్దు. 30 ఏండ్లుగా ఇక్కడ ఉంటున్నం. ఇప్పుడు నోటీసులిచ్చి పొమ్మంటే ఎక్కడ పోవాలె. ఎట్ల బతకాల్నో అర్థం అయి తలేదు. బాధతో తిండి కూడా తినాలనిపిస్తలేదు. మాలాంటి గరీబోల్లను ఇబ్బంది పెడితే ఎట్ల. మా గోడు ఎవరికి చెప్పాలె? ఎక్కడికి పోవాలె? మా బతుకులు ఆగం చేయొద్దు. గవర్నమెంటోళ్ళు పెద్దోళ్ల ఎంబడి పడాలె.., మా ఎంబడి పడితే.. ఏం లాభం? ఆలోచన చేసి మాకు న్యాయం చేయుండ్రి.

– ముత్ర సుజాత, హరిజన బస్తీ నివాసి

ఎస్‌బీఐ చైర్మన్‌ను కలిసిన వాసవి గ్రూపు ప్రతినిధులు

దేశ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు నూతన చైర్మన్‌గా ఇటీవల నియమితులైన శ్రీనివాసులు శెట్టిని ముంబైలోని ఎస్‌బీఐ కార్యాలయంలో శనివారం కలిసిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త, వాసవీ గ్రూపు చైర్మన్ ఎర్రం విజయ్ కుమార్, డైరెక్టర్లు సాయి రాజేష్, కౌశిక్, వైష్ణవి తదితరులు. – సిటీబ్యూరో, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ);

ధర్నా నిర్వహిస్తున్న లారీ యజమానులు

ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు వేధిస్తున్నారు

టీజీఎండీసీ ఎదుట లారీ యజమానుల ధర్నా

ఖైరతాబాద్, ఆగస్టు 31: ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ తమను వేధిస్తున్నారని ఆటోనగర్ ఇసుక లారీ యజమానుల సంఘం వాపోయారు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయం ముందు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు సుర్వి రాజు గౌడ్ మాట్లాడుతూ, తాము అధికారికంగా ప్రభుత్వానికి డీడీ తీసి క్వారీల వద్దకు వెళ్లగా, అక్కడ ఉన్న కాంట్రాక్టర్లు లోడింగ్ పేరుతో రూ.4000 నుంచి రూ.5000, అదనపు బకెట్ కోసం రూ.2000, పట్టా, జేసీబీ, గ్రామ పంచాయతీ పేరుతో రూ.1000 చొప్పున, కాంటా పేరుతో రూ.200 వసూలు చేస్తూ తమను దోచుకుంటున్నారన్నారు. దీనికి తోడు అధికారుల తనిఖీల నేపథ్యంలో ఓవర్ లోడ్ పేరుతో కేసుల పాలవుతున్నామన్నారు. తమకు పరిష్కారం చూపాలంటూ టీజీఎండీసీ జనరల్ మేనేజర్ రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నర్రి వెంకన్న, బల్వంత రెడ్డి, నాగేందర్ రెడ్డి, రాజు ముదిరాజ్, కాసుల జంగయ్య గౌడ్, ఆకుల శ్రీణు, రాజేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఐ అండ్ పీఆర్ జేడీగా పదవీ విరమణ పొందిన మూర్తూజ అలీకి వీడ్కోలు పలుకుతున్న జీహెచ్ఎంసీ మేయర్, ఉద్యోగులు

ఐ అండ్ పీఆర్ జేడీ మూర్తూజ అలీ పదవీ విరమణ

ఘనంగా సన్మానం చేసిన తోటి ఉద్యోగులు

సిటీబ్యూరో, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ): మూడు దశాబ్దాలకు పైగా రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తూ జాయింట్ డైరెక్టర్ హోదాలో శనివారం పదవీ విరమణ పొందిన మహ్మద్ మూర్తూజను ఉద్యోగులు ప్రత్యేకంగా అభినందించి, సన్మానం చేశారు. ఈ సందర్భంగా మహ్మద్ మూర్తూజ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో ఉట్నూరు ఐటీడీఏ అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా పని చేసిన కాలం ఎన్నో మధుర జ్ఞాపకాలను పదిలపరుచుకునేలా చేసిందన్నారు. అక్కడి నుంచి క్రమంగా వివిధ హోదాల్లో పనిచేస్తూ ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది జీహెచ్ఎంసీలో సీపీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ప్రధానంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్‌ఓగా పనిచేస్తున్న సమయంలో పదవీ విరమణ పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పదవీ విరమణ పొందిన మూర్తూజకు ప్రత్యేకంగా సన్మానం చేసి జ్ఞాపికను సమర్పించగా, సహ ఉద్యోగులు సైతం ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

పల్లె దవాఖానల్లో ఓపీ సంఖ్య పెంచాలి

శామీర్‌పేట మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన
అలియాబాద్ పల్లె దవాఖాన, శామీర్‌పేట పీహెచ్‌సీ రికార్డుల పరిశీలన
రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి: మేడ్చల్ కలెక్టర్

శామీర్‌పేటలోని మహాత్మాగాంధీ జ్యోతి బా పూలె బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట, ఆగస్టు 31: ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పల్లె దవాఖానల్లో అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించి పల్లె దవాఖానల్లో అవుట్ పేషంట్ల సంఖ్యను పెంచాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మెడికల్ అండ్ ఆఫీసర్‌కు సూచించారు. శామీర్‌పేట మండల పర్యటనలో భాగంగా శనివారం అలియాబాద్ పల్లె దవాఖానను సందర్శించిన కలెక్టర్ ప్రతి రోజు అవుట్ పేషంట్లు ఎంతమంది వస్తారు? సిబ్బంది ఎంతమంది ఉన్నారు? అనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. దవాఖానలో వైద్య సేవల రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించి ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్లను గుర్తించి, వాటి నమోదు రిజిష్టర్లను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్ ఈడీడీ క్యాలెండర్, వంద కాలమ్ రిజిష్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం, శామీర్‌పేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వైద్య సిబ్బంది, అందిస్తున్న సేవలు, అవుట్ పేషంట్లు, డెంటల్, ల్యాబ్ విభాగాలను పరిశీలించారు. లేబర్ రూమ్‌లో హైడ్రాలిక్ డెలివరీ టేబుల్‌ను తెప్పించుకోవాలని, అందుకు అవసరమైన నిధుల కోసం ప్రణాళిక తయారు చేసి నివేదిక పంపాలని సూచించారు. అదే విధంగా శామీర్‌పేటలోని అమీనా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జ్యోతి బా పూలె బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులు కల్పించాలి, విద్యార్థులకు అవసరమైన లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు టాయిలెట్లకు అవసరమైన మరమ్మతులు చేయించాలని సూచించారు. భోజనశాలకు వెళ్లే దారిలో మొరం పోయించడంతో పాటు భోజనశాలలో టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. వీటికి అయ్యే ఖర్చులను యాజమాన్యానికి ఇచ్చే అద్దెలో 4, 5 నెలల్లో కొంచెం కొంచెంగా మినహాయించాలని ఆదేశించారు. స్టోర్ రూమ్, సామగ్రిని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో రఘునాథ స్వామి, ఎంపీడీవో మమతా బాయి, రెసిడెన్షియల్ స్కూల్ నిర్వాహకులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగనాథ్ రాకతో బస్తీవాసుల్లో హై టెన్షన్

అల్లాపూర్, ఆగస్టు 31: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సున్నం చెరువును శనివారం సందర్శించారు. రెండ్రోజులుగా సున్నం చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న పద్మావతినగర్ బస్తీ వాసులకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. క్రమంలోనే రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి రంగనాథ్ సున్నం చెరువుకు శనివారం రావడంతో నోటీసులు అందుకున్న పద్మావతినగర్ బస్తీవాసుల్లో హైటెన్షన్ మొదలైంది. ఒక వైపు నగరంలో కూల్చివేతలు, మరో వైపు నోటీసులు, వెనువెంటనే రంగనాథ్ రాకతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బస్తీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సున్నం చెరువు శేరిలింగంపల్లి,కూకట్‌పల్లి మండలాల పరధిలోకి వస్తుంది.మొత్తం సున్నం చెరువు విస్తీర్ణం, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధి వివరాలను రంగానాథ్ అధికారుల ద్వారా తెలుసుకున్నట్టు సమాచారం.

ఈదుల కుంట పరిశీలన

మాదాపూర్: శేరి లింగంపల్లిలోని ఖానామెట్‌కు చెందిన ఈదుల కుంట చెరువు ఆక్రమణకు గురైన నేపథ్యంలో సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం స్థానిక రెవెన్యూ, హైడ్రా అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి రెవెన్యూ అధికారుల వద్ద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు శేరిలింగంపల్లిలో అనేక చెరువులు కబ్జాకు గురైనట్లు గుర్తించామని తెలిపారు.

ఇఫ్లూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ లక్ష్మి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 31: ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ హరిబండి లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ ప్రొఫెసరైన లక్ష్మిని ఇన్‌చార్జి వీసీగా నియమించాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటివరకు ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన ప్రొ.సురభి భారతి పదవీ విరమణ చేయడంతో ఈ నియామకాన్ని చేపట్టారు. ట్రాన్స్‌లేషన్ స్టడీస్ విభాగానికి చెందిన ఆమె సంబంధిత విభాగంలో నిపుణురాలు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో కేఎల్‌హెచ్ వర్సిటీకి 22వ ర్యాంకు

సిటీబ్యూరో, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ): ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో కేఎల్‌హెచ్ హైదరాబాద్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించిందని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ పార్థసారథి వర్మ శనివారం హర్షం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్–2024లో తమ హైదరాబాద్ క్యాంపస్ అత్యుత్తమ పనితీరును కనబరిచిందుకు గాను ఈ ర్యాంకును కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణల దిశగా అడుగేయాలి

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ వీఎస్కే రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, ఆగస్టు 31: విద్యార్థులు ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి విశ్వ విద్యాయలంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూయర్‌షిప్ సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఆకలింపు చేసుకోవాలన్నారు. నైపుణ్యాలను పెంపొందించుకొని నూతన ఆవిష్కరణల నాంది పలకాలన్నారు. ప్రస్తుతం యుగంలో విద్యార్థులకు ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. నూతన ఆలోచనలతో ముందుకు వస్తే కార్యరూపంలోకి తీసుకురావడానికి పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పరిశ్రమల స్థాపించే స్థాయికి ఎదగాలని సూచించారు. వైస్ చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ, యువతను సృజనాత్మకంగా ఆలోచించేలా చేసి, ఆవిష్కరణకు సరైన మార్గదర్శకత్వాన్ని ఇచ్చే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆంజనేయులు, డీన్ డాక్టర్ తయ్యాబా ఖతూన్ పాల్గొన్నారు. ఎడోడ్వాజా కంపెనీ ప్రతినిధి, మధులాష్ బాబు, స్టూడెంట్ ట్రైబ్ చరణ్, ఏఐ ఇన్నోవేటర్ మధు వడ్లమాని, అగ్రోవ్యకవచ ప్రతినిధి హరిప్రసాద్, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిపుణులు సౌమ్య, స్వాతి రుషిత, కార్తీక్, అభిషేక్, ముస్కాన్, వడోరియా తమ అనుభవాలను పంచుకున్నారు. 50కి పైగా కళాశాలలకు చెందిన 1000 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని, ఆవిష్కరణల ప్రదర్శనలు ఇచ్చారు.

అంగన్‌వాడీలకు ప్రభుత్వం అన్యాయం

ప్రభుత్వ నిర్ణయాలపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు

శామీర్‌పేట, ఆగస్టు 31: అంగన్‌వాడి ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షురాలు జి.సునీత అన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శనివారం శామీర్‌పేట మండల కేంద్రంలో అంగన్‌వాడి టీచర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడి కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ చిన్నారులకు విద్యా బోధన చేస్తూనే ప్రజలకు, ప్రభుత్వానికి 40 ఏండ్లుగా అనేక సేవలందిస్తున్నామని గుర్తు చేశారు. అంగన్‌వాడి ఉద్యోగులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 65 ఏండ్లు నిండిన అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లకు జూలై –1 నుంచి విధులకు హాజరు కావొద్దని సర్కులర్ జారీ చేయడం జరిగిందన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ తగ్గించి ఇచ్చే నిర్ణయాన్ని మానుకోవాలి, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు భూజాల పద్మతో పాటు అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతతోనే దేశ స్వావలంబన

రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు సతీశ్ రెడ్డి

సదస్సులో భాగంగా వేదిక్ సైన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కొండాపూర్, ఆగస్టు 31: ఏ దేశమైనా స్వావలంబన సాధించాలంటే అత్యాధునిక సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలని రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు జీఓఐ, ఎఫ్ఆర్ చైర్మన్, డీఆర్డీఓ డాక్టర్ జి.సతీశ్ రెడ్డి అన్నారు. నాలెడ్జ్ సిటీలోని టీ – హబ్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 'వేద జ్ఞానం, ఆధునిక సాంకేతికత'లపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యాధునిక టెక్నాలజీలో పురోభివృద్ధిని సాధించినప్పుడే ఆ దేశ స్వావలంబన సాధ్యమవుతుందన్నారు. వేద శాస్త్రాలలో నిరూపితమైన సాంకేతికతలు ఉన్నాయని, గూఢ లిపి శాస్త్రం వంటి మెటీరియల్స్‌లో క్రిప్టోగ్రఫీ నేపథ్య అంశాలు చాలా ఉన్నాయన్నారు. భాతరదేశాన్ని విశ్వగురువుగా విజ్ఞానం, ఆవిష్కరణలలో గ్లోబల్ లీడర్‌గా చూసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేద శాస్త్రాల నుంచి వచ్చిన ఫలితాలు దేశాభివృద్ధిలో సహాయపడతాయన్నారు. అనంతరం, వేదిక్ సైన్స్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంగోపాల్ రావు, డాక్టర్ ఏబీఎస్ శాస్త్రీ, టీ – హబ్ సీఈఓ ఎం.శ్రీనివాసరావు, ఐకాన్ భారత్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పీజీ రావు, ఈ సదస్సును నగరంలోని పలు యూనివర్సిటీలు, టీ – హబ్‌తో కలిసి నిర్వహిస్తున్నాయి.